సాక్షి శ్రీకాకుళం

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



మాతృభాషకు పట్టాభిషేకం

రేపు మాతృభాషా దినోత్సవం. మాతృభాష ప్రాశస్త్యాన్ని గుర్తు చేసుకోవాల్సిన రోజు.

- 8లో



కష్టార్జితం కాలిపోయింది..

తేలుకుంచిలో ఓ కిరాణా దుకాణం కాలిపోయింది. దాచుకున్న డబ్బులన్నీ బూడిదైపోయాయి.

- 8లో

23న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

టెక్కలి: టెక్కలిలో ఈ నెల 23న జిల్లా స్థాయి అండర్-15 చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలిండియా చెస్ ఫెడరేషన్ ట్రైనర్ ఎస్.భీమారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి లోపు విద్యార్థులకు టెక్కలి ఓక్లాండ్ పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు రూ.300 ప్రవేశ రుసుంతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని. మరిన్ని వివరాలకు 9912559735, 9492802386 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

పాలకొండకు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక నేడు



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహనరెడ్డి పాలకొండకు గురువారం రానున్నారని, ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు నిచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఎంతో రాజకీయ చరిత్ర కలిగి అనేక పదవులు పొంది ప్రజలకు సేవ చేసిన పాలవలస రాజశేఖరం ఇటీవల మరణించిన విషయం విదితమే. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పాలకొండ పట్టణానికి వస్తారని తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

శ్రీముఖలింగంలో బారికేడ్లు ఏర్పాటు



శ్రీముఖలింగంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

జలుమూరు: శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీముఖలింగంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. ముందుగా ఆలయం రెండు వైపులా మాడవీధుల గుండా బారికేడ్లు ఏర్పాటుచేసి అవసరమైతే ఆలయ పరిసరాల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయంలో తొమ్మిది సీసీ కెమెరాలు ఉండగా అదనంగా సీసీ కెమెరాలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

నేడు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు గురువారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వి.శ్రీధర్‌రాజా తెలియజేశారు. ఈ మేరకు ఉదయం 10.30 గంటల నుంచి 6వ స్థాయీ, 11.30 గంటలకు 3వ, 12.30 గంటల నుంచి 5వ, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి వరుసగా 2వ, 4వ, 1వ, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని ప్రకటించారు. సంబంధిత ఉమ్మడి జిల్లా అధికారులంతా తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం




మాట్లాడుతున్న డీఆర్ఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్ల) పాత్ర కీలకమని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. సూక్ష్మ పరిశీలకులతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా అనుసరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఆహార తనిఖీ..
వసూళ్లకు కీ

ఓ అధికారి చేతివాటం

- హోటల్స్, స్వీట్ స్టాల్స్, ఇతర షాపుల నుంచి అడ్డగోలు వసూళ్లు
- తాజాగా పలాసలో ఒక్కొక్క హోటల్ నుంచి రూ.10వేలు డిమాండ్
- హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చిన అక్కడి యజమానులు
- ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన అసోసియేషన్ నాయకులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఆ అధికారి వస్తే చాలు హోటల్స్, స్వీట్ స్టాల్స్ యజమానులు హడలెత్తిపోతున్నారు. ఆహార తనిఖీల పేరుతో హడావుడి చేసి సొమ్ము గుంజుకుంటున్నారు. హోటల్‌కు వచ్చి దర్జాగా తిని, ఇంటికి పార్సిల్ కూడా కట్టించుకుని, ఆపై హోటల్‌కు ఇంత చొప్పున రేటు ఫిక్స్ చేసి దండుకుంటున్నారు. హోటల్స్, రెస్టారెంట్లకైతే ఏకంగా రూ.10 వేల చొప్పున డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా పలాసలో పలు హోటల్స్ యజమానులను ఇలాగే డిమాండ్ చేస్తే వారంతా గగ్గోలు పెట్టడంతో పాటు హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. చోటు చేసుకున్న పరిణామాలను ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లారు.

జిల్లాలో దాదాపు 3వేలకు పైగా పెద్ద, చిన్నహోటల్స్ ఉన్నాయి. స్వీట్ స్టాల్స్ 200 వరకు ఉన్నాయి. లైసెన్స్‌డ్ కిరాణా షాపులు 1500 వరకు ఉన్నాయి. వీటితో పాటు ప్యాకింగ్ వాటర్ యూనిట్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. వీటిన్నింటినీ విధిగా తనిఖీ చేయాలి. నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నారో లేదో చూసుకోవాలి. ప్రజారోగ్యానికి హాని జరగకుండా పర్యవేక్షించాలి. అంతవరకు ఫర్వాలేదు గానీ తనిఖీల ముసుగులో చేతివాటం ప్రదర్శించడంతో విమర్శలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఓ అధికారి వసూళ్లే లక్ష్యంగా చేసుకుని హోటల్స్, స్వీట్ స్టాల్స్ తదితర షాపులపై 'దృష్టి' పెడుతున్నారు. ముఖ్యంగా హోటళ్లలోకి ఎప్పటికప్పుడు వెళ్లడమే కాకుండా తనకు కావాల్సిన వారిని తీసుకెళ్లి కడుపు నిండినంత తింటున్నారు. అంతటితో ఆగకుండా పార్శిల్స్ కట్టించి తీసుకుని వెళ్తున్నారు. అక్కడితో వదిలేయకుండా ఎప్పటికప్పుడు మామూళ్లకు తెగబడుతున్నారు. ఈ ప్రభావం మిగతా ప్రాంతాల్లో కంటే శ్రీకాకుళం నగరంలోని హోటల్స్‌పై ఎక్కువగా పడుతోంది. ఈయన బాగోతాలు ఆ హోటల్స్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. చెప్పినట్టుగా ఆ హోటల్స్ యజమానులు చేయకపోతే నానా హడావుడి చేస్తుంటారు. ఈయనతో ఎందుకని చాలా మంది సర్దుకుపోవాల్సి వస్తోంది.

ప్రజారోగ్యం కోసం తనిఖీలు చేయడంలో తప్పేమీ లేదు. కానీ దాన్ని ఆసరాగా తీసుకుని వసూళ్లకు తెగబడటమే కాకుండా ఫుడ్ కోసం కక్కుర్తి పడటం ముమ్మాటికీ తప్పే. ముఖ్యంగా హోటల్స్, స్వీట్ స్టాల్స్‌లో టేస్టింగ్ సాల్ట్, రకరకాల రంగులు వాడుతున్నారా? ప్లేట్లను ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తున్నారా? తయారీకి వాడే వస్తువులు శుభ్రంగా ఉన్నాయా? లేదా? కిచెన్ నీటుగా ఉందా? ఏ రోజు ఆయిల్ ఆ రోజే వినియోగిస్తున్నారా? ఒకసారి ఫ్రై చేసేందుకు వాడిన ఆయిల్‌ను మళ్లీ వినియోగిస్తున్నారా? వండిన ఆహారం ఫ్రిజ్‌లో పెడుతున్నారా? ఫ్రోజోన్ ఫుడ్స్‌ను ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచుతున్నారా? ఇలాంటివన్నీ తనిఖీ చేసి సరి చేయాలి. ఎక్కడైనా తేడాలుంటే సూచనలు చేయడంతో పాటు హెచ్చరికలు చేయాలి. ముఖ్యంగా హోటల్స్, స్వీట్ స్టాల్స్ తదితర వన్నీ క్లీన్‌గా, స్వచ్ఛమైన పదార్థాలతో ఆహార ఉత్పత్తులు తయారు చేసేలా సంబంధిత యజమానులకు అవగాహన కల్పించాలి. సీరియస్ నెస్ ఎక్కువగా ఉంటే కేసులు నమోదు చేయాలి. అవసరమైతే విజిలెన్స్‌కు రాయాలి. ఈ రకమైన పర్యవేక్షణ చేయాల్సింది పోయి తన స్వార్థ ప్రయోజనాల కోసం అధికారాన్ని వాడుకోవడం విమర్శలకు తావిస్తోంది.

రూ.10 వేలు ఇవ్వాల్సిందే..

తాజాగా పలాసలో హోటల్స్ తనిఖీకి వెళ్లిన ఈ అధికారి ఒక్కోక్క హోటల్ నుంచి రూ. 10వేలు డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఒక్కసారిగా రూ.10వేలు అంటే కష్టమని సదరు హోటల్స్ యజమానులు ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని సంబంధిత హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అసోసియేషన్ నాయకులు అక్కడి ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లి వ్యాపారాలు సక్రమంగా చేసుకునేలా చెప్పాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది.


ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఎవరి నుంచి ఫిర్యాదులు అందలేదు. ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. ప్రజారోగ్యం కోసం పాటు పడాలే తప్ప వసూళ్లకు పాల్పడకూడదు. సాధ్యమైనంత వరకు సక్రమంగా ఉండేలా హోటల్స్, స్వీట్‌స్టాల్స్ తదితర యజమానులకు అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు సూచనలు చేయాలి. ప్రమాదకరంగా ఉంటే శాంపిల్స్ తీసుకుని పరీక్షలు చేసి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలి.

– కె.వెంకటరత్న, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, శ్రీకాకుళం

మధ్యవర్తి తెలుగు తమ్ముడే..

- విదేశీ ఉద్యోగాల మోసంలో టీడీపీ కార్యకర్త హస్తం



ఇచ్ఛాపురం రూరల్: ఇటలీలో ఉద్యోగాల పేరిట ఇచ్ఛాపురం కేంద్రంగా జరిగిన మోసం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మంగళవారం సాక్షి దినపత్రికలో 'విదేశీ ఉద్యోగాల పేరిట టోకరా' శీర్షికన ప్రచురితమైన కథనంతో మరింత మంది బాధిత యువకులు మీడియా ముందుకు రావడం ప్రారంభించారు. అయితే ఇటలీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జిల్లాలో ఉన్న 350 మంది నిరుద్యోగుల వద్ద సుమారు ఆరున్నర కోట్ల రూపాయలతో పరారైన ఒడిశా వాసి కొచ్చెర్ల ధర్మారావురెడ్డికి తోడు, నీడగా, మధ్యవర్తిగా ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కాయి దిలీప్‌రెడ్డి వ్యవహరించడం సంచలనంగా మారింది. వరుసకు తనకు కొచ్చెర్ల ధర్మారావురెడ్డి చిన్నాన్న అవుతారని, మధ్యవర్తిగా తాను ఉంటానంటూ నమ్మించడంతో తామంతా మోసపోయామని బాధిత యువకులు గొల్లుమంటున్నారు. తమకు సంబంధించి లావాదేవీలు సైతం కాయి దిలీప్ రెడ్డితో పాటు బెజ్జిపద్ర గ్రామానికి చెందిన శ్రీను ద్వారా జరిగాయని మీడియా ముందుకు వచ్చిన యువకులు చెబుతున్నారు.

వైద్య పరీక్షల పేరిట దోపిడీ

విదేశాలకు వెళ్లే యువకులకు తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయాలి. హెచ్ఐవీ, పచ్చకామెర్లు, కొలస్ట్రాల్, ఎక్స్ రే, మూత్రం, బీపీ, షుగర్, కిడ్నీ పనితీరు వంటి వైద్య పరీక్షలకు ఒక్కో యువకుడి నుంచి ఏడు వందల నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేయాలి. దీన్ని ఆసరాగా చేసుకొని ఏజెంట్ కొచ్చెర్ల ధర్మారావు, మధ్యవర్తులు స్థానికంగా ఉన్న 'అమ్మా డయాగ్నిస్టిక్ సెంటర్'ను ఎంచుకున్నారు. 350 మంది యువకులకు ఈ ల్యాబ్‌లోనే వైద్య పరీక్షలు చేసుకోవాలంటూ చెప్పడంతో ఒక్కో యువకుడు రూ.3,250 నుంచి రూ.3,500 చొప్పున సుమారు రూ.10 లక్షలు వరకు సమర్పించుకున్నారు. కనీసం తమకు మెడికల్ రిపోర్ట్ కూడా ఇవ్వలేదని బాధిత యువకులు చెబుతున్నారు. ఈ అంశంపై సంబంధిత ల్యాబ్ నిర్వాహకుడిని వివరణ కోరగా.. ఏజెంట్ ఆదేశాల మేరకు వైద్య పరీక్షల కోసం రూ.2,500 చొప్పున తీసుకోవడం జరిగిందని, దీంతో పాటు అదనంగా పేపర్స్ కోసం రూ.750లు చొప్పున తీసుకోవాలంటూ ఏజెంట్ చెప్పడంతో తీసుకున్నామని, ఏజెంట్ తన కమిషన్ కూడా తీసుకున్నాడని స్పష్టం చేశాడు. కాయి దిలీప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏజెంట్ ధర్మారావు రెడ్డిని ఇంతకు ముందెప్పుడూ చూడలేదని, దూరపు చుట్టం అంటూ వరుస కలుపుకొని తనను ఇందులో ఇరికించాడని. తానూ బాధితుడినేనని, తనకే పాపం తెలీదని అన్నాడు. ప్రస్తుతం బాధిత యువకులు స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు.



స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కాయి దిలీప్‌రెడ్డి



ఏజెంట్ ధర్మారావు రెడ్డికి డబ్బులు ముట్టజెబుతున్న కాయి దిలీప్‌రెడ్డి



యువకులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అమ్మా మెడికల్ ల్యాబ్

వైఎస్ జగన్‌తో కురసాల కన్నబాబు భేటీ



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు బుధవారం భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా కీలక బాధ్యతలు అప్పగించిన తర్వాత తొలిసారి ఆయన జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి, వాటిపై పోరాడాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కన్నబాబుకు నిర్దేశించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఇంకా ఎండగట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్ని మరింత సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, వారితో మమేకమవుతూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పార్టీ పరంగా వేగంగా స్పందించి అండగా నిలవాలని కన్నబాబుకు అధినేత వైఎస్ జగన్ ఆదేశించారు.

సమీకృత కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్:

సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నూతన కలెక్టరేట్ ఆవరణలో జరుగుతున్న పార్కింగ్, సెక్యూరిటీ, ప్రహరీ తదితర పనులను బుధవారం పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ ప్రతినిధులకు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.




పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

దోబూచులాట..

అరుణ వర్ణ ఆకాశం.. నిశిలాంటి మబ్బు తునకలు.. నిష్కకణికలా సూరీడు.. మబ్బుల మధ్య దోబూచులాడుతూ సూర్య భగవానుడు బుధవారం ఇలా కనువిందు చేశారు. గ్రహణ కాలాన్ని గుర్తుకు తెస్తూ మేఘ కెరటాల మధ్య ఇలా మునకలేశాడు. శ్రీకాకుళం సమీపంలో ఈ దృశ్యమాలిక కనువిందు చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం











క్లుప్తంగా

ఉగాది పురస్కారాల కవితా సంపుటాలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: వేమన కవితా నిలయం(శ్రీకాకుళం), తపస్వి మనోహరం (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో ఉగాది సందర్భంగా సాహితీ పురస్కార సభ ఏర్పాటు చేస్తున్నట్లు మహ్మద్ రఫీ, తపస్వీ మనోహరం అధినేత నిమ్మగడ్డ కార్తీక్, బుర్రి కుమారరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విశ్వావసు నామ ఉగాది సందర్భంగా మార్చి 23న జరిగే ఈ సభ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు 2023 ఏడాదిలో ముద్రణ జరిగిన కవితా సంపుటి రెండు ప్రతులను మార్చి 15లోగా పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన మూడు పుస్తకాలకు రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. సభకు హాజరైన వారికి సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. కవితా సంపుటాలను పోస్టు లేదా కొరియర్ ద్వారా మహ్మద్ రఫీ (ఈవేమన), ఎస్–1 శారదా అపార్టుమెంట్, లక్ష్మీనగర్, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా 532407 చిరునామాకు పంపించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం కలకలం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని హయాతినగరం సమీపంలో నాగావళి నదీ తీరంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. వ్యక్తి ఎడమ చేతి భుజంపై మహిళ బొమ్మ, డి.లక్ష్మి అనే అక్షరాలు పచ్చబొట్టుగా వేసి ఉన్నాయని ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. బాగా కుళ్లిన స్థితిలో ఉండటంతో సుమారు ఐదు రోజులు కిందట వ్యక్తి చనిపోయి ఉంటాడని, వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నామన్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలిని పరిశీలించామని, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని చెప్పారు. వివరాలు తెలిస్తే ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయవచ్చన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న మృతదేహం

కాశీబుగ్గ: మందస మండలం లోహరిబంద గ్రామంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రి అనూష (14) లోహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయింది. ఏం జరిగిందో గానీ ఇంటి పక్కనున్న తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని వెతుక్కుంటూ వెళ్లిన ఉపాధ్యాయులు చెట్టుకు వేలాడటం చూసి నిర్ఘాంతపోయారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడి రైతులకు పోటీలు

రణస్థలం: ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానం వినియోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తి సాధించి పశుపోషణ లాభసాటిగా మార్చడం, ఔత్సాహిక నిరుద్యోగ యువతను పాడి పరిశ్రమ వైపు ఆకర్షితులను చేసే ఉద్దేశంతో పాల పోటీలు నిర్వహిస్తున్నట్లు రణస్థలం పశుసంవర్ధకశాఖ ఏడీఏ బి.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర స్థాయిలో మార్చి 14 నుంచి 16 వరకు విజయనగరం జిల్లా తోటపాలెంలో కె.వైకుంఠరావు డైరీ ఫారమ్‌లో జరిగే ఈ పోటీలకు పాడి రైతులు పాల్గొనాలని కోరారు.

గంజాయి నేరగాళ్లపై ఉక్కుపాదం

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారిని, క్రయవిక్రయాలు జరిపేవారిని, సేవించేవారిని గుర్తించి ప్రత్యేక షీట్లు తెరవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశించారు. రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గంజాయి నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ అమలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసులపై సమీక్షించారు. గంజాయి ద్వారా ఆదాయం అర్జించే వారి ఆస్తుల స్వాధీనం చేసుకోవడంతో పాటు పీడీ యాక్టు పెట్టేలా పురోగతి చూపాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందేలా చొరవతీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు పట్టాభిషేకం



- తెలుగుతనం ఉట్టిపడేలా దుకాణాల పేర్లు
- భాషాభివృద్ధికి పలువురు కవులు, రచయితల కృషి

రేపు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్:

మనకు ఎన్ని భాషలు తెలిసినా మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలిగేది ఒక్క మాతృభాషలోనే. అలాంటి కమ్మనైన అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. విద్య, ఉద్యోగావసరాల రీత్యా ఇతర భాషలు అవసరమైనప్పటికీ మాతృభాషను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. ఇదే ఆలోచనతో జిల్లాకు చెందిన పలువురు రచయితలు, కవులు తమ రచనలు కొనసాగిస్తున్నారు. మాతృభాష అయిన తెలుగు భాషాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నారు. ఇదే ఒరవడి వ్యాపారరంగంలోనూ కొనసాగుతుండటం విశేషం. తమ వ్యాపార సముదాయాల పేర్లను అచ్చమైన తెలుగు భాషలో రాస్తూ మాతృభాషపై ప్రేమను చాటుకుంటున్నారు. ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలని యూఎన్ఓ(యునెస్కో విభాగం) ప్రకటించింది. మన రాష్ట్రంలో 2006 నుంచి మాతృభాష దినోత్సవం జరుపుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ప్రారంభించింది.



జిల్లా కేంద్రంలో తెలుగు పేర్లతో ఉన్న దుకాణాల బోర్డులు

వ్యవహారిక భాషావేత్త గిడుగు..

మన జిల్లాకు చెందిన గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాష కోసం ఎంతగానో కృషి చేశారు. ఆనాటి పాలన, గ్రంథాలలో ఉన్న భాషలో కాకుండా సామాన్య ప్రజలు మాట్లాడుకునే భాషలో రచనలు చేసి నాటి రచయితలను మేల్కొపేలా కృషి చేశారు. ఒక విధంగా నాటి నుంచే మాతృభాషా విప్లవం మొదలైందని చెప్పవచ్చు.

జిల్లాలో తెలుగుదనం..

ఇటీవల వ్యాపార వర్గాలు సాధారణ, మధ్య తరగతి వర్గాలకు చేరువయ్యేందుకు తమ దుకాణాలకు తెలుగుదనం ఉట్టిపడేలా పేర్లు పెడుతున్నారు. కోనసీమ రుచులు, వంటిల్లు, అమ్మచేతి వంట, బొమ్మరిల్లు, నేటి విందు, అభిరుచి, పులిహోర వంటి పేర్లు పెట్టి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు సైతం తెలుగు బోర్డులు పెడుతున్నాయి. ఇక ఆయుర్వేద వైద్యశాల, ఖాదీ నిలయం వంటివి ఎప్పటి నుంచో వాడుకలో ఉన్నాయి.

అందరి బాధ్యత..



అమ్మభాషలో ఉన్న కమ్మదనం ఇతర భాషల్లో ఉండదు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విడవరాదు. ఇది ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా అందరూ సమష్టిగా మాతృ భాషాభివృద్ధికి చొరవ చూపాలి.

– కోనే శ్రీధర్, హిందీ మంచ్ వ్యవస్థాపకులు

అక్షయపాత్ర వంటిది..



అమ్మభాషను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. తెలుగు భాష సొగసైన పద్యాలు, సౌరభాలు వెదజల్లే గద్యాలు, మురిపించే కావ్యాలతో నిండి ఉండే అక్షయ పాత్ర వంటిది.

– డాక్టర్ సనపల నారాయణమూర్తి, తెలుగు పండితులు

నిరంతర కృషి..



తెలుగు రచయితల వేదిక తెలుగు భాష కోసం నిరంతరం కృషి చేస్తోంది. విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, ప్రతి ఆదివారం కవితా గోష్ఠులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతోంది.

– ఆర్.వి.రమణమూర్తి, తెరవే కార్యదర్శి



తల్లిదండ్రుల పాత్ర కీలకం..



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నేటి తరం పిల్లలకు అమ్మభాషపై ఆసక్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఒక భాష విలసిల్లాలంటే దాన్ని మాట్లాడే వ్యక్తులు అధికంగా ఉండాలి. పరభాషలు నేర్చుకునే ప్రయత్నంలో అమ్మభాషకు అన్యాయం చేయకూడదు.

– లలితా రెడ్డి, తెలుగు ఉపాధ్యాయిని, రచయిత

మాతృభాషలోనే అభ్యాసం



మాతృభాష సృజనశీలి. వ్యక్తిత్వ వికాస సూత్రం. ప్రాథమిక, మాధ్యమిక విద్యావ్యవస్థలో మాతృభాషలో బోధన, అభ్యసనం చాలా అవసరం. ఇటీవల జిల్లాలో చాలామంది దుకాణాలకు తెలుగు పేర్లు పెట్టడం స్వాగతించదగ్గ పరిణామం.

– భమిడిపాటి గౌరీశంకర్, తెలుగు విభాగాధిపతి, గాయత్రీ కళాశాల

సిక్కోలు రచయితల కృషి..

మాతృభాష అభివృద్ధి కోసం తమ వంతుగా జిల్లాకు చెందిన పలువురు రచయితలు, కథకులు కృషి చేస్తున్నారు. తరచూ తెలుగు వేదికల నిర్వహణ, తెలుగు పండగల సమయంలో కవితా సమ్మేళనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ మాతృభాషపై అభిమానం చాటుకుంటున్నారు. తెలుగు రచయితల వేదిక, ఉపనిషన్మందిరం, సాహితీ స్రవంతి, సాహితీ చైతన్య కిరణాలు, బాల కథా నిలయం, శ్రీకాకుళ సాహితీ, కవితా నిలయం, యువ రచయితల వేదిక తదితర వేదికల ద్వారా తెలుగు అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

రైతులకు ఉపయోగపడేలా శిక్షణ

ఆమదాలవలస: రైతులకు ఉపయోగపడేలా యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ బి.ముకుంద రావు సూచించారు. ఆమదాలవలసలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం కె.వి.కె. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు అధ్యక్షతన 43వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025– 26 సంవత్సరంలో చేయాల్సిన పరిశీలన క్షేత్రాలు, ప్రదర్శన క్షేత్రాలపై దిశానిర్దేశం చేశారు. నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి, కె.వి.కె. సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, జిల్లా మత్స్య అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్, ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, యానిమల్ హస్బండ్రీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ రావు, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి కె.రమేష్ కృష్ణ, నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అండ్ హెడ్ విస్తరణశాఖ డాక్టర్ డి.చిన్నంనాయుడు, కీటక శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ పి.సీతారాం, రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.ఉదయ బాబు, ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ జి.చిట్టిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ భవానీశంకర్, రెడ్డి ఫౌండేషన్ మేనేజర్ హరిబాబు వివిధ అంశాలపై ప్రసంగించారు. రైతులకు అందించాల్సిన శిక్షణలు, పరిశోధనలు, దిగుబడులు, చీడ పీడ నివారణపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.ముకుందరావు

కష్టార్జితం కాలిపోయింది..

- షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం
- కాలి బూడిదైన రూ.3 లక్షల నగదు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామంలో బుధవారం షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో కిరాణా షాపు దగ్ధమైంది. కష్టపడి దాచుకున్న సొమ్ము కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుడియా బిమ్మో ఇంట్లోనే కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం వేకువజాము ఐదు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే అత్తమ్మ వైద్యం కోసం పెట్టెలో భద్రపరిచిన మూడు లక్షల రూపాయల నగదు కాలిపోయాయి. రెండు ఫ్రిజ్‌లు, కిరాణా సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు మూడున్నర లక్షల రూపాయల సామాన్లు కాలిపోయినట్లు అగ్నిమాపకాధికారులు కె.ప్రశాంత్, సూర్యారావు తెలిపారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి పరామర్శించారు.



కాలిపోయిన నగదును చూపిస్తున్న బాధితుడు

నెలాఖరులోగా 'పల్లె పండుగ' పూర్తవ్వాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ ఈ నెల చివరి వారం నాటికి పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు, పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో మండలాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంజూరైన, పూర్తయిన పనులు, బిల్లుల మంజూరు, పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మంజూరైన రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు నూరు శాతం పూర్తిచేసి బిల్లులు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగియకముందే, నిధులు వెనక్కు వెళ్లక ముందే చొరవ తీసుకుని పని చేయించాలన్నారు. పంచాయతీరాజ్ అధికారులకు నిర్దేశించిన పనుల ప్రగతిలో వెనుకబడిన కొత్తూరు, వజ్రపు కొత్తూరు, టెక్కలి మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు. విధుల్లో అలసత్వం చూపుతున్నారని, 60 శాతం పనులు మాత్రమే పూర్తవడం పట్ల పాతపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎచ్చెర్లలో సచివాలయ ఉద్యోగుల హాజరు 46 శాతం మాత్రమే ఉండడాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇకపై ఏ మండలంలోనైనా సచివాలయ ఉద్యోగుల హాజరు 70 శాతం కంటే తక్కువ ఉంటే ఆయా ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీఓ భారతి సౌజన్య, జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథ స్వామి, డీఎంహెచ్ఓ టీవీ బాలకృష్ణ, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● మూగవేదన



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని కేటీ రోడ్డులో బుధవారం వేకువజామున ఓ లారీ దూడను ఢీకొట్టింది. సుమారు 100 మీటర్లు ఈడ్చుకుపోవడంతో దూడ అక్కడికక్కడే మృతిచెందింది. దూడను వెతుక్కుంటూ అక్కడికి వచ్చిన ఆవు తల్లడిల్లిపోయింది. చాలాసేపు అక్కడే ఉండిపోయింది. కాగా, అర్ధరాత్రి వేళ భారీ వాహనాలకు ప్రవేశ అనుమతి లేకపోయినా టోల్‌గేట్ చార్జీలు తప్పించుకోవడానికి కొందరు పలాస, కాశీబుగ్గ పట్టణా మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– కాశీబుగ్గ

స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాలకు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏలూరులోని శాయ్ స్పోర్ట్స్ హాస్టల్ ఎస్ఎల్‌కేసీలో ప్రవేశాలకు ఈ నెల 27, 28 తేదీల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో బాలికలు, అథ్లెటిక్స్‌లో బాలురుకు ఎంపికలు జరుగుతాయని చెప్పారు. 12 నుంచి 18 ఏళ్ల బాలబాలికలు అర్హులని తెలిపారు. ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు, చదువుకు ఫీజులు, స్పోర్ట్స్ కిట్‌లు, ఇన్సూరెన్స్ సదుపాయాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కల్పిస్తుందని వివరించారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక జరిగే ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక్(9885312356), వి.ఉదయ్‌సందీప్ (వెయిట్‌లిఫ్టింగ్ కోచ్)(9182993497) నంబర్లను సంప్రదించాలని కోరారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్ పెట్టిందని విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్మత్స విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. బుధవారం బీజేపీ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఇటీవల ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెట్ 2025–26పై మేధావుల సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌లోని ముఖ్య అంశాలపై పలువురు వక్తలు చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అమ్మన్నాయుడు, చార్టర్డ్ అకౌంటెంట్ ఐ.కె.రావు, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, అంబేడ్కర్ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావు, కంపెనీ సెక్రటరీ బుర్రా భార్గవ్, విద్యావేత్త నిక్కు అప్పన్న, ఎన్‌జీవో మణిశర్మ, గురజాడ విద్యాసంస్థల ప్రతినిధి సంయుక్త, విద్యావేత్త జామి భీమశంకర్, జర్నలిస్టు సంఘ నాయకుడు కొంక్యాణ వేణుగోపాల్, డాక్టర్ పైడి సింధూర, బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దుర్గారావు గాంధి, కరుణాకరరావు, నరేంద్రచక్రవర్తి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పురాతన ఆలయ మెట్ల వద్ద పూజలు చేస్తున్న వేదపండితులు



స్వామివారి తిరువీధి ఉత్సవం



పూజలందుకుంటున్న వాసుదేవుడు

● తిరువీధుల మెరసీ దేవదేవుడు!

మందస వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం వాసుదేవునికి హనుమద్వాహన సేవ ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అర్చకులు కూర్మాచార్యులు, సత్యానందపాడి ఆధ్వర్యంలో దేవతాహ్వానం, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టారు. సంతానార్థులకు గరుడ ప్రసాద వితరణ చేశారు. అనంతరం శేషవాహన సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

– కాశీబుగ్గ